క్లుప్తంగా

కరాటే పోటీల్లో కదిరి విద్యార్థుల సత్తా



పతకాలు సాధించిన విద్యార్థులు

కదిరి అర్బన్: కర్ణాటక రాష్ట్రం గౌరీబిదనూరులో జరిగిన జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కదిరి బ్లూమూన్ విద్యా సంస్థల విద్యార్థులు సత్తా చాటారు. నిఖిత కటా, కుమితే విభాగాల్లో ప్రథమ స్థానం, విష్ణువర్ధన్ కటాలో 3వ స్థానం, మనోహర కటాలో 3వ స్థానం, కుమితేలో ప్రథమ స్థానం, పావని కటాలో ప్రథమ స్థానం, ప్రమేష్ కటాలో 3వ స్థానం, కుమితేలో 3వ స్థానం, జగదీష్ కటా, కుమితే విభాగాల్లో 2వ స్థానం సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ శివశంకర్, హెచ్‌ఎం సురేంద్రరెడ్డి అభినందించారు.

మున్సిపల్ ఆదాయం పెంపునకు చర్యలు

ప్రశాంతి నిలయం: మున్సిపల్ ఆదాయం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో కదిరి మున్సిపల్ అధికారులతో జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఆదాయం పెంచుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ సూచనలు చేశారు. కదిరిలోని పాత మున్సిపల్ కార్యాలయం భవనం, హిందూపురం రోడ్డులో గల పాత మున్సిపల్ ఉన్నత పాఠశాల భవనం శిథిల దశలో ఉన్నందున, వాటిని పడగొట్టి మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించేందుకు, హిందూపురం రోడ్డులో ఉన్న పాత మున్సిపల్ ఉన్నత పాఠశాల భవనాన్ని తొలగించి మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీసా, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ సంజీవ్ కుమార్, పబ్లిక్ హెల్త్ డీఈ నరసింహమూర్తి, ,కదిరి, పుట్టపర్తి మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.

89 మందికి ఉద్యోగావకాశాలు



జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు, కంపెనీల ప్రతినిధులు

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్ద ఉన్న మంగళకర ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 89 మంది అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు లభించినట్లు స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి హరిక్రిష్ణ పేర్కొన్నారు. వివిధ కంపెనీలకు చెందిన 10 మంది ప్రతినిధులు హాజరై రెండు రౌండ్ల ఇంటర్వ్యూలు నిర్వహించారు. 165 మంది హాజరు కాగా.. అందులో ప్రతిభ కనబరచిన 89 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి తేజ్‌కుమార్‌రెడ్డి, నైపుణ్యాభివృద్ధి ఫైనాన్స్ ఆఫీసర్ శివప్రసాద్, కోఆర్డినేటర్ ఆంజనేయులు, మంగళకర కళాశాల మేనేజింగ్ ట్రస్టీ సురేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్య ప్రకాష్, ఏఓ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. త్వరలోనే ప్లేస్‌మెంట్ చూపుతామన్నారు.

ఆర్డీటీ లైసెన్స్ రెన్యూవల్ చేయాలి

చెన్నేకొత్తపల్లి: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని ఆ సంస్థ అభిమానులు మండల కేంద్రంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

రోడ్లు, పారిశుధ్యంపై దృష్టి

ఓడీచెరువు : వర్షాలు కురుస్తున్నందున రహదారులు, పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని ఎంపీపీ తుమ్మల పర్వీన్‌భాను అధికారులను ఆదేశించారు. ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు రోడ్డు గుంతలమయమై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మీదేవి, ఎంపీడీఓ శివరాం ప్రసాద్ రెడ్డి , తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ అంజినప్ప, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

రెండు రోజులు తాగునీరు బంద్

కదిరి టౌన్: పార్నపల్లి చిత్రావతి రిజర్వాయర్ నుంచి దొరిగల్లు పంప్‌హౌస్, మలకవేమల పంప్‌హౌస్ మీదుగా కదిరి పట్టణానికి వచ్చే తాగునీటి సరఫరాకు రెండు రోజులు అంతరాయం కలగనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ తెలిపారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి పంప్‌హౌస్‌కు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని, రిపేరీకి రెండు రోజులు సమయం పడుతున్నందున బుధ, గురువారాల్లో తాగునీరు సరఫరా కాదని తెలిపారు. ప్రజలు సహకరించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముదిగుబ్బ: రామస్వామి తండా వద్ద మంగళవారం ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో బుక్కపట్నం మండలం గశికవారిపల్లికి చెందిన చిన్నప్ప, గంగాద్రి అనే వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం 108లో బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు.

పాలకులను నిలదీయండి

పుట్టపర్తి: సూపర్ సిక్స్ సహా వందలాది హామీలను అమలు చేయని కూటమి పాలకులను ప్రజలు నిలదీయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం బుక్కపట్నం మండలం గశికవారిపల్లిలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమంపై సమావేశం నిర్వహించి, హామీల అమలు తీరుకు సంబంధించి క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను ఎంతమేరకు అమలు చేసిందని అడిగారు. హామీలు అమలు చేయకుండా ప్రజలను ఎలా వంచించారో వివరిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, గశికవారిపల్లి సర్పంచ్ గోవిందరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట రఘు, మండల మైనార్టీ విభాగం కన్వీనర్ రఫీ, మండల పార్టీ ఉపాధ్యక్షులు రంగారెడ్డి, మల్లేష్, సీనియర్ నేత మాజీ ఎంపీటీసీ రంగారెడ్డి, ,మండల బూత్ లెవల్ కమిటీ మేనేజర్ పతంజలి, మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఎల్‌ఐసీ చంద్ర, ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు మాల్యవంతం మారుతి, మండల ప్రధాన కార్యదర్శి పూలకుంట్ల నాగభూషణ, మండల యువజన విభాగం అధ్యక్షుడు ధర్మతేజరెడ్డి, ఎస్సీ సెల్ విభాగం మండల శాఖ అధ్యక్షుడు నీలూరి ఈశ్వర్, సీనియర్ నాయకుడు విశ్రాంత ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి, నారాయణస్వామి, మండల కార్యదర్శి చింతల్‌రెడ్డి, గుణ, హరిప్రసాద్ రెడ్డి, నౌషద్, ఎల్‌ఐసీ జగన్, పుల్లారెడ్డి, మాజీ డీలర్ శ్రీనివాసరెడ్డి, బుచ్చయ్యగారిపల్లి వైస్ సర్పంచ్ కృష్ణారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, సురేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.





గశికవారిపల్లి, ఎర్రబల్లి గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' పోస్టర్లు ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

కొత్తచెరువు: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బండ్లపల్లి గ్రామ పంచాయతీ ఎర్రబల్లిలో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ ఎన్నికల హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. నమ్మి ఓట్లు వేసిన ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారని మండిపడ్డారు. హామీలు అమలు చేయని కారణంగా ఒక్కో కుటుంబం ఎంతమేర నష్టపోయిందో బేరీజు వేసుకోవాలన్నారు. హామీలు ఎందుకు అమలు చేయలేదో ప్రజాప్రతినిధులను నిలదీయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సర్పంచ్ గీతా రూప్లానాయక్, నంజిరెడ్డి, హనుమంతరెడ్డి, మారుతీప్రసాద్‌రెడ్డి, రాజారెడ్డి, గోవిందరెడ్డి, అనిల్, శంకర్‌రెడ్డి, సూర్యనారాయణ, నాగేశ్వర్‌రెడ్డి, రామచంద్ర రెడ్డి, వినోద్, అశ్వర్థ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలి

బత్తలపల్లి: స్వాతంత్య్ర దినోత్సవం రోజున దేశ భక్తిని చాటుతూ ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకం ఎగురవేయాలని ఎంపీడీఓ నరసింహనాయుడు సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 79వ స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్-హర్ ఘర్ తిరంగ కార్యక్రమాలు ఎంపీడీఓ ఆధ్వర్యంలో నిర్వహించారు. త్రివర్ణ పతాకాన్ని చేతబూని కార్యాలయ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఉప మండల పరిషత్తు అభివృద్ధి అధికారి క్రిష్టప్ప, కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: సమాజంలో పౌరులందరూ దేశ భక్తి కలిగి ఉండాలని వక్తలు సూచించారు. మంగళవారం పుట్టపర్తిలో బీజేపీ నాయకులు, పట్టణ ప్రజలు, విద్యార్థులు కలసి తిరంగా ర్యాలీ నిర్వహించారు.

నల్లమాడ: మండల కేంద్రం నల్లమాడలో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాను చేతబూని



బత్తలపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో వద్ద త్రివర్ణ పతాకంతో అధికారులు, సిబ్బంది

భారత్ మాతాకీ జై అంటూ నినదించారు. పాత సచివాలయ ముందు మానవహారంగా ఏర్పడ్డారు. సీఐ నరేంద్రరెడ్డి, ట్రైనీ ఎస్‌ఐ నరేష్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలాజీ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలల విద్యార్థులు, బీజేపీ మండల అధ్యక్షులు ఆంజనేయులు పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల కేంద్రం నల్లచెరువులో ప్రభుత్వ అధికారులు, విద్యార్థులు, బీజేపీ నాయకులు మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ రఘునాథ గుప్తా, ఈఓ ఆర్డీ శకుంతల, ఎంఈఓ తిరుపాల్ నాయక్, జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, బీజేపీ మండల కన్వీనర్ కమ్మల వేమనారాయణ, ఉపాధ్యాయులు షఫి తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: మండల కేంద్రం తనకల్లులో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో హ ర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. నాయకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు జాతీయ పతాకంతో ర్యాలీ చేశారు.

గాండ్లపెంట: బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామల కేశవరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గాండ్లపెంటలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ కూడలిలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. ఉపాధ్యాయులు మువ్వన్నెల జాతీయ పతాకం, స్వాతంత్య్ర దినోత్సవం, తిరంగ ర్యాలీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబూరావ్, హెచ్‌ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

96 శాతం మందికి 'ఆల్బెండజోల్' పంపిణీ



విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న ఆర్డీఓ సువర్ణ, ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ సునీల్

పుట్టపర్తి అర్బన్: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో మంగళవారం 96.47 శాతం మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ మేరకు ఆర్‌బీఎస్‌కే జిల్లా అధికారి డాక్టర్ సునీల్ పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఎనుములపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణతో కలిసి విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. అలాగే జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వైద్య సిబ్బంది సమక్షంలో విద్యార్థుల చేత మింగించారు. 3,66,225 మంది పిల్లలు ఉండగా మొదటి రోజు 3,53,279 మందికి అందజేశారు. ఈ నెల 20న మాప్ అప్‌డే లో భాగంగా మిగిలిన పిల్లలకు పంపిణీ చేయనున్నట్లు సమాచారం.

అవగాహనతోనే ఎయిడ్స్ నివారణ

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం

పుట్టపర్తి అర్బన్: ఎయిడ్స్‌పై సంపూర్ణ అవగాహన కలిగి ఉన్నప్పుడే దాని నివారణ సాధ్యమవుతుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం అన్నారు. సమగ్ర ఐఈసీ కార్యక్రమంలో భాగంగా ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పుట్టపర్తిలో మంగళవారం ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రశాంతి గ్రామంలోని వై జంక్షన్ వరకూ ర్యాలీ కొనసాగింది. అనంతరం మానవహారం ఏర్పాటు చేసి ఎయిడ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడారు. సుఖ వ్యాధుల నియంత్రణ, మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే ఇబ్బందులు, చెడు వ్యసనాలపై అవగాహన పెంచుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ సునీల్... మాట్లాడుతూ ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ చట్టం-2017పై అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీతో జీవించే వారి పట్ల వివక్ష రూపుమాపాలన్నారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో క్షయ నియంత్రణ వైద్యాధికారి డాక్టర్ గాయత్రి, ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, నారాయణస్వామి, ఎన్‌జీఓ ప్రాజెక్టు మేనేజర్లు ఆంజనేయులు, తిప్పేస్వామి, శ్రీనివాసులు, నవీన్, సిబ్బంది మూర్తి, నవీన్, నిజం, జనజాగృతి, చైతన్య, ఫోర్డ్, శక్తి మైత్రి మహిళా మండలి సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం

పీఆర్‌సీ ఏర్పాటు చేయాలి

కదిరి అర్బన్/ పుట్టపర్తిటౌన్/ ధర్మవరం అర్బన్: ఉద్యోగులకు పీఆర్‌సీ ఏర్పాటు చేయాలని నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కదిరి, పుట్టపర్తి, ధర్మవరం ఆర్టీసీ డిపో గ్యారేజీల ఎదుట నాయకులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు పీఆర్‌సీ ఏర్పాటు చేయడంతో పాటు మధ్యంతర భృతి మంజూరు చేయాలన్నారు. గవర్నర్ పేట-2 డిపోకు చెందిన 4.15 ఎకరాల స్థలాన్ని 'లులూ' సంస్థకు బదలాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీఓను ఉపసంహరించుకోవాలన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ తరలింపు ఆపాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 4 కరువు భత్యాలను వెంటనే ప్రకటించాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల గ్రాట్యుటీ, లీవుల మొత్తాలు చెల్లించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో ఎన్‌ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీ రమణ, కదిరి డిపో కార్యదర్శి బైరెశెట్టి, అధ్యక్షుడు రామక్రిష్ణ, రామ్మోహన్, మల్లికార్జున, జోనల్ వైస్ ప్రెసిడెంట్ శంకర్, పుట్టపర్తి డిపో అధ్యక్షులు శివశంకర,



కదిరి డిపోలో నిరసన తెలుపుతున్న నాయకులు

రీజనల్ ఉపాధ్యక్షులు రవితేజ, డిపో కమిటీ సలహాదారు అప్పిరెడ్డి, సీనియర్ నాయకులు ఈశ్వరయ్య, గయాజ్‌బాషా, డిపో కార్యదర్శి గంగులయ్య, నాయకులు ఈవ్వరప్ప, నూర్‌మహమ్మద్, శివారెడ్డి, కళావతి, లక్ష్మీపతి, జిల్లా చైర్మన్ ముత్యాలప్ప, జోనల్ నాయకులు ఏఎస్ రావు, జిల్లా నాయకులు మోహన్, దుర్గాప్రసాద్, నాగప్ప, సాబ్, డిపో అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి మధుసూదన్, గ్యారేజీ అధ్యక్షుడు కుమార్, కార్యదర్శి హరి, కోశాధికారి వైవీన్ రెడ్డి, సీసీఎస్ డెలిగేట్ రాయుడు, ఎంఎంరత్నం, సీనియర్ నాయకులు పీఎస్ ఖాన్, మాధవ్, ఎంసీజీరావు తదితరులు పాల్గొన్నారు.

బోధనకు దూరం చేస్తున్నారు

ఎన్పీ కుంట: ఉపాధ్యాయులను కావాలనే బోధనకు దూరం చేస్తున్నారని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాదరెడ్డి మండిపడ్డారు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం ఉపాధ్యాయులతో ఆయన సమావేశమై మాట్లాడారు. విద్యారంగంలో కూటమి ప్రభుత్వం తీసుకువస్తున్న సంస్కరణలు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగిస్తూ రోజురోజుకూ బోధనకు దూరం చేసేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని విమర్శించారు.

గంజాయి విక్రేత పరారీ!

కదిరి అర్బన్: సున్నపుగుట్ట తండాలో షామీర్ అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడని మంగళవారం కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్టేషన్‌కు గ్రామస్తుల ద్వారా సమాచారం అందింది. సీఐ నిరంజన్‌రెడ్డి వెంటనే పోలీసు సిబ్బందిని గ్రామానికి పంపించగా.. అప్పటికే గంజాయి విక్రేత పరారయ్యాడు.

కీచక ఎస్‌ఐపై చర్యలకు డిమాండ్

పుట్టపర్తి టౌన్: గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన పట్నం పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ రాజశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం (జీవీఎస్‌ఎస్)రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ధర్మవరం రూరల్: స్థానిక ఎన్‌జీఓ కార్యాలయంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై ధర్మవరం వ్యవసాయ డివిజన్‌లోని ఆర్‌ఎస్‌కే సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఏడీఏ లక్ష్మానాయక్ హాజరై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ ముస్తఫా, శిక్షణాధికారులు హరికుమార్, ఆదినారాయణ, నరసింహులు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై వడ్డీ వ్యాపారుల దాడి

ధర్మవరం అర్బన్: అప్పు రికవరీలో వడ్డీ వ్యాపారులు ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచారు. ధర్మవరం వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన సుధాకర్ తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం చరణ్, హరి, నరేష్‌ల వద్ద రెండు నెలల క్రితం రూ.10 వేలు అప్పుగా తీసుకున్నాడు. వారం రోజుల్లోనే రూ.2 వేలు తిరిగి చెల్లించాడు. ఇంకా రూ.8 వేలు చెల్లించాల్సి ఉంది. అయితే కొన్నిరోజులుగా అప్పు చెల్లించకుండా మాట దాటవేస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలోనే మంగళవారం సాయంత్రం సుధాకర్ కేశవనగర్‌లో ఉన్న టీ కేఫ్‌లో తన స్నేహితుడు దినేష్‌తో కలిసి ఉండగా... చరణ్, హరి, నరేష్ అక్కడి వచ్చారు. బాకీ రూ.8 వేలు వెంటనే ఇవ్వాలని నిలదీశారు. మాటామాటా పెరగడంతో సుధాకర్ స్నేహితుడు దినేష్ సర్దిచెప్పేందుకు ప్రయత్నించాడు. ఆగ్రహించిన వారు అతనిపై దాడి చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'మా స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించారు'

చెన్నేకొత్తపల్లి: న్యామద్దెల గ్రామంలో కోర్టులో కేసు నడుస్తున్నా తమ ఇంటి స్థలాన్ని గ్రామానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు దౌర్జన్యంగా ఆక్రమించారని బాధితులు మంగళవారం విలేకరుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బాధితులు తలారి నారాయణ, తలారి చంద్రమౌళి తదితరులు విలేకరులతో మాట్లాడారు. గ్రామంలోని సర్వేనంబర్ 325/2ఎలో 6.22 ఎకరాల భూమి తమదని ఇందుకు సంబంధించిన రికార్డులు తమ వద్ద ఉన్నాయన్నారు. అయితే అందులో 30 సెంట్లు తమ గ్రామానికి చెందిన తలారి పోతన్న, టి.ముత్యాలప్ప, టి.రాజప్ప దౌర్జన్యంగా ఆక్రమించి చుట్టూ కంచె వేసుకున్నారన్నారు. ప్రస్తుతం దీనిపై అనంతపురం కోర్టులో కేసు నడుస్తోందన్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మీకు దిక్కున చోటికి వెళ్లి చెప్పుకోండని, ప్రస్తుతం మా ప్రభుత్వం ఉందంటూ తమపై దాడికి ప్రయత్నించారన్నారు. దీనిపై కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో విచారణ చేసి తమ స్థలాన్ని తమకు ఇప్పించాలని వారు కోరారు.



స్థలం రికార్డులను చూపుతున్న బాధితులు

సంక్షిప్త వార్తలు

ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

కదిరి అర్బన్: పట్టణంలోని జెడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో మంగళవారం ఏఐఎస్‌ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ మాజీ నాయకులు సురేంద్రచౌదరి, జిల్లా అధ్యక్షుడు పవన్, మహేంద్ర పాల్గొన్నారు.

అద్దె భవనంలో ఎందుకు నిర్వహిస్తున్నారు?

కదిరి అర్బన్: గట్లు వద్ద గిరిజన ప్రతిభా కళాశాలను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మంగళవారం సందర్శించారు. కళాశాలకు తనకల్లు మండలం సీజీ ప్రాజెక్ట్ వద్ద సొంత భవనం ఉండగా.. దాన్ని వదిలి రూ.80 వేల అద్దె భవనంలో ఎందుకు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం లోపు కళాశాలను సొంత భవనంలోకి మార్చాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.

రంగనాథన్‌కు ఘన నివాళి

ధర్మవరం: పట్టణంలోని గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ పితామహుడు ఎస్‌ఆర్ రంగనాథన్ 133వ జయంతి నిర్వహించారు. రంగనాథన్ చిత్రపటానికి గ్రంథాలయ అధికారి అంజలి సౌభాగ్యవతి, సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు.

జీవీఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షునిగా బాలక్రిష్ణ నాయక్

నల్లచెరువు: గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం (జీవీఎస్‌ఎస్) జిల్లా అధ్యక్షునిగా బాలేపల్లి తండాకు చెందిన బాలక్రిష్ణ నాయక్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్ నాయక్‌కు బాలక్రిష్ణనాయక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు.

వైభవంగా కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్ట

కనగానపల్లి: కేఎన్ పాళ్యంలో మంగళవారం కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. మహిళలు జ్యోతులు, బోనాతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి సమర్పించారు.

వ్యవసాయ భూమిలో రోడ్డు వద్దు

ఎన్పీకుంట: వ్యవసాయ యోగ్యమైన మాన్యం భూమిలో రహదారి నిర్మాణం చేపట్టవద్దని పలువురు రైతులు కోరుతున్నారు. సారగుండ్లపల్లి సమీపంలో గల బోడిచెంద్రాయుని ఆలయానికి సంబంధించిన 44 ఎకరాల మాన్యం భూముల్లో అదే గ్రామానికి చెందిన 12 మంది రైతులు ఒక్కొక్కరు 4 ఎకరాల చొప్పున కౌలుకు వేలం పాటలో దక్కించుకున్నారన్నారు. ఈ ఏడాది జూన్‌లో కౌలు గడువు అయిపోయిందని, దేవదాయ శాఖ అధికారులు వేలం నిర్వహిస్తే మళ్లీ కౌలుకు తీసుకొని ఉలవ పంట సాగు చేసుకుంటామని రైతులు కదిరప్ప, రాజప్ప, ఆదినారాయణ, యోగీశ్వర, ఆదెప్ప, భాస్కర్‌రెడ్డి, శ్రీరాములు తెలిపారు. అయితే ఇప్పుడు బోడిచెంద్రాయునిగుట్టపై శిథిలమై దశాబ్ద కాలంగా మూసివేసిన ఆలయానికి ఉపాధి హామీ పథకం కింద రూ.4.50 లక్షల వ్యయంతో రహదారి నిర్మాణం చేపడుతున్నారన్నారు. తమ నోటికాడి కూడు లాగేయవద్దని వేడుకుంటున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జ్ ఏపీఓ శ్రీధర్‌రెడ్డిని వివరణ కోరగా ఆదే గ్రామానికి చెందిన రామక్రిష్టారెడ్డి అనే వ్యక్తి ఎండోమెంట్ ద్వారా అనుమతి తీసుకున్నామని, పనులు కల్పించాలని కోరడంతో రహదారి పనులు ప్రారంభించామని తెలిపారు. పని జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలించి.. కౌలు రైతులు ఆక్షేపిస్తే పనులు నిలిపి వేస్తామని స్పష్టం చేశారు.

పారిశుధ్య చర్యలు



విజయలక్ష్మి కాలనీలో పారిశుధ్య పనులు చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

నల్లచెరువు: పారిశుధ్య లోపంపై అధికారులు స్పందించారు. మండల కేంద్రం నల్లచెరువులోని విజయలక్ష్మి కాలనీలో 'పారిశుధ్యం.. అధ్వానం' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఈఓఆర్డీ శకుంతల, సర్పంచ్ పంచరత్నమ్మ, పంచాయతీ కార్యదర్శి నరేష్ స్పందించి మంగళవారం కాలనీలో పర్యటించారు. మురుగు నీరున్న చోట వైద్య ఆరోగ్య సిబ్బంది బ్లీచింగ్ పౌడర్ చల్లారు. పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య కార్మికులు తొలగించారు.

మరవపల్లిలో నాకాబందీ

తాడిమర్రి: వర్షాకాలంలో విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ కృష్ణవేణి గ్రామస్తులకు సూచించారు. మరవపల్లిలో మంగళవారం ఆమె సిబ్బందితో కలసి నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లు, దొడ్లు, గడ్డివాముల్లో సోదాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామస్తుల సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున గ్రామంలో విద్యుత్ స్తంభాలను తాకకూడదన్నారు. తోటల్లో పంటలకు నీరు పెట్టడానికి వెళ్లే రైతులు మీటర్ పెట్టెలను తాకకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు.

ర్యాగింగ్ నిర్మూలనే లక్ష్యం



విద్యార్థులతో అధ్యాపకులు

పుట్టపర్తి టౌన్: ర్యాగింగ్ నిర్మూలనే లక్ష్యంగా ప్రతి విద్యార్థి నడుచుకోవాలని బెస్ట్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ పట్నాయక్ సూచించారు. మంగళవారం బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీలో జాతీయ ర్యాగింగ్ వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. అనంతరం ర్యాగింగ్ వ్యతిరేక వీడియోలను ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ముగిసిన ఆరాధన మహోత్సవాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో నున్న మంత్రాలయ రాఘవేంద్రస్వామి ఆలయంలో 354వ ఆరాధన మహోత్సవ వేడుకలు మంగళవారంతో ముగిశాయి. స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం శ్రీ లలిత నాట్య కళానికేతన్ నాట్య గురువులు బాబు బాలాజీ శిష్య బృందం 15 మంది నాట్య ప్రదర్శన చేశారు. శివతాండవ నృత్యం, రాఘవేంద్ర మహత్యం నృత్య రూపకం, కుంభ జ్యోతి నాట్యం, కూచిపూడి తరంగం లాంటి నాట్యాలు అందరిని ఆకట్టుకున్నాయి.

దేశాభివృద్ధికి దోహదపడాలి

ధర్మవరం అర్బన్: నేటి యువత నిరాశ, నిర్లిప్తత వీడి దేశాభివృద్ధికి దోహదపడాలని డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చిట్టెమ్మ సూచించారు. పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఇంటర్నేషనల్ యూత్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ యువత చక్కటి లక్ష్యాన్ని ఏర్పరచుకుని.. ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోపాల్‌నాయక్, అధ్యాపకులు త్రివేణి, షమీవుల్లా, పావని, హైమావతి, తాహిర్, పుష్ప, ఆనంద్, మీనా, ధనుంజయ, విద్యార్థులు పాల్గొన్నారు.